క్లుప్తంగా

దుర్గి ఎస్‌ఐ బాధ్యతల స్వీకారం



దుర్గి: మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో శాంతి భద్రతలను పటిష్టం చేయుటకు కృషి చేస్తానని దుర్గి ఎస్‌ఐ శివ అన్నారు. శనివారం స్థానిక పోలీసు స్టేషన్‌లో బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతలకు విఘాతం కల్పిస్తే అసాంఘీక శక్తులపై కఠిన చర్యలు తీసుకుంటానని అన్నారు. మండల పరిధిలో జూదం, నాటుసారాయి, తెలంగాణ మద్యం అమ్మే వ్యక్తుల కదలికలను గమనించి కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. శాంతి భద్రతల గురించి సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన దుర్గి ఎస్‌ఐ శివకు పలువురు అధికారులు, ప్రజా ప్రతినిధులు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

నేడు విద్యుత్ బిల్లుల చెల్లింపు

నరసరావుపేట: బరంపేటలోని విద్యుత్ కార్యాలయంలో ఆదివారం విద్యుత్ బిల్లులు చెల్లించేందుకు ఏర్పాటుచేసిన కౌంటర్‌ను వినియోగదారులు ఉపయోగించుకోవాలని డెప్యూటీ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ వై.ఏడుకొండలు శనివారం వెల్లడించారు.

వ్యక్తి ఆత్మహత్య

నరసరావుపేట టౌన్: కుటుంబ వివాదాల నేపథ్యంలో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శుక్రవారం రాత్రి పట్టణంలో చోటుచేసుకుంది. బరంపేట ఇస్కాన్ టెంపుల్ సమీపంలో నివాసం ఉంటున్న తమ్మలూరి వెంకట సాంబశివరావు (35) శుక్రవారం రాత్రి పూటుగా మద్యం సేవించి ఇంటికి వచ్చాడు. భార్యతో గొడవపడి ఇంట్లోని ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కొద్దిసేపటి తర్వాత గమనించిన కుటుంబ సభ్యులు సాంబశివరావుని కిందకు దించి పరిశీలించగా అప్పటికే మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ రహంతుల్లా శనివారం ఉదయం సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఆత్మహత్యకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈ మేరకు మృతుడి తండ్రి సీతారామాంజనేయులు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

సర్పంచ్‌కు విద్యుదాఘాతం

రొంపిచర్ల: మండల కేంద్రమైన రొంపిచర్ల గ్రామ సర్పంచ్ కొమ్ము నాగేశ్వరరావుకు విద్యుదాఘాతమై కిందపడటంతో తలకు బలమైన గాయాలయ్యాయి. శనివారం మరమ్మతులు నిర్వహిస్తుండగా ఈ సంఘటన జరిగింది. తీవ్రగాయాలైన నాగేశ్వరరావును వైద్య సేవల నిమిత్తం నరసరావుపేటలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. ఆయన పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లు బంధువులు వెల్లడించారు.

ఉచిత కంటి వైద్యశిబిరం

నరసరావుపేట ఈస్ట్: జిల్లా పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం అసోసియేషన్ భవనంలో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. డాక్టర్ రామలింగారెడ్డి మ్యాక్సివిజన్ కంటి వైద్యశాల సిబ్బంది శిబిరంలో పాల్గొని పింఛన్‌దారులకు శుక్లాలు, నీటికాసులు తదితర కంటి సమస్యల పరీక్షలు నిర్వహించి ఐ డ్రాప్స్ మందులు అందచేశారు. దాదాపు 60 మంది అసోసియేషన్ సభ్యులకు పరీక్షలు జరిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు మానం సుబ్బారావు, కార్యదర్శి ఆదెయ్య, అసోసియేట్ ప్రెసిడెంట్ కె.సత్యనారాయణ, రాఘవయ్య, మాధవరెడ్డి పాల్గొన్నారు.

చిన్నారులకు కథల పోటీలు



నరసరావుపేట ఈస్ట్: తిరుమల తిరుపతి దేవస్థానములు, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో శనివారం బరంపేటలోని శ్రీసరస్వతి శిశుమందిరంలో చిన్నారులకు కథ చెబుతారా! ఊ.. కొడతాం కథల పోటీలు నిర్వహించారు. చిన్నారులలో సృజనాత్మకత, ఊహాశక్తి, విలువలు పెంపొందించేందుకు పోటీలను నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి గుంటూరుజిల్లా సమన్వయకర్త ఇ.అమ్మడు తెలిపారు. పోటీలో జూనియర్స్ విభాగంలో సాయిమణికంఠ, అల్తాఫ్, విశాల్, సీనియర్ విభాగంలో ఆర్.చక్రి, డి.హరిణి, వి.చరణ్ బహుమతులు సాధించారు. న్యాయనిర్ణేతలుగా రత్నాకరం రాము, ఆర్.సురేష్, ఇందిరా శాస్త్రీ, వీఎల్ఎన్ మూర్తి వ్యవహరించారు.

ఆటో డ్రైవర్‌కు గాయాలు

నాదెండ్ల: జాతీయ రహదారిపై సిగ్నల్‌బోర్డును తప్పించే క్రమంలో ఆటో బోల్తాపడి డ్రైవర్‌కు గాయాలైన సంఘటన జాతీయ రహదారిపై గణపవరం పరిధిలోని టీబీ ఆసుపత్రి వద్ద శుక్రవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. హైవే పెట్రోలింగ్ పోలీసుల కథనం ప్రకారం.. గణపవరం గ్రామానికి చెందిన యోహాను తన ట్రాలీ ఆటోలో చిలకలూరిపేటలో సరుకు అన్‌లోడ్ చేసి తిరిగి గణపవరం వెళ్తున్నాడు. ఈ క్రమంలో టీబీ ఆసుపత్రి వద్దకు వచ్చే సరికి జాతీయ రహదారి మరమ్మతులు చేస్తున్నందున సిగ్నల్స్‌ను ఏర్పాటు చేశారు. వీటిని తప్పించే క్రమంలో ఆటో బోల్తా పడింది.

భక్తిశ్రద్ధలతో మొహర్రం వేడుకలు



దాచేపల్లి వీధుల్లో ఊరేగుతున్న పీర్లు



మొహర్రం వేడుకల్లో పీర్లతో పాల్గొన్న తుమ్మకోట ముస్లింలు



పీర్లను నాగులేరుకు తీసుకువెళ్తున్న ఆచారవంతులు

దాచేపల్లి : మొహర్రం పండుగ వేడుకలు భక్తిశ్రద్ధలతో శనివారం జరుపుకున్నారు. జిల్లా వ్యాప్తంగా దాచేపల్లిలో జరిగే మొహర్రం వేడుకలకు ప్రత్యేకత సంతరించుకున్నది. ఇక్కడ గంధం పీర్లు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. శుక్రవారం అర్ధరాత్రి నుంచే చావిడిలలో అలంకరణ చేసిన పీర్లను బయటకు తీసి మేళతాళాలతో ఊరేగించారు. వీధుల్లో పీర్లు తిరుగుతున్న క్రమంలో భక్తులు బోరుగులు, బెల్లంతో పాటుగా కానుకలు సమర్పించారు. దాచేపల్లిలోని రెండు చావిడిలలో ఉన్న మూడు గంధం పీర్లను కూడా గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. చావిడిల వద్ద ఏర్పాటు చేసి గుండం చుట్టూ పీర్లు ప్రదక్షిణలు చేశాయి. పీర్లు పట్టుకున్న వ్యక్తులు గుండంలోని నిప్పుల మీదుగా నడిచారు. గుండం చుట్టూ పీర్లు తిరిగిన తరువాత చావిడిలలోకి వెళ్లాయి. మూడవ రోజున పీర్లను నాగులేరులో శుభ్రం చేసిన తరువాత చావిడిలలో భద్రపరుస్తారు. పీర్ల చావిడిలను విద్యుత్ దీపాలతో అలంకరణ చేశారు. నగర పంచాయతీ చైర్మన్ కొప్పుల సాంబయ్య, జెడ్పీటీసీ మూలగొండ్ల ప్రకాష్‌రెడ్డి, మాజీ చైర్మన్ మునగా పున్నారావు, వైస్ చైర్మన్లు షేక్ ఖాదర్‌భాషా, కొమెర బత్తిన విజయ్‌కుమార్, మాజీ సర్పంచ్‌లు బుర్రి విజయ్‌కుమార్‌రెడ్డి, మండపాటి రమేష్‌రెడ్డి, పార్టీ మండల, పట్టణ కన్వీనరుల కోట కృష్ణ, షేక్ సుభానీ, వైస్ ఎంపీపీలు కందుల జాను, తండా అబ్దుల్‌సత్తార్ తదితరులు పీర్ల వద్ద మొక్కులు తీర్చుకున్నారు.

ఘనంగా దాచేపల్లి తిరునాళ్ల ..

మొహర్రం పండుగ సందర్భంగా ప్రతిఏడాది దాచేపల్లిలో తిరునాళ్లను జరుపుకుంటారు. దాచేపల్లితో పాటుగా చుట్టు పక్కల గ్రామాల ప్రజలు ఈ తిరునాళ్లలో పాల్గొన్నారు. దాచేపల్లిలోని పీర్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. దాచేపల్లి హైస్కూల్ సమీపంలో ఏర్పాటు చేసిన జెయింట్‌వీల్, రంకులరాట్నంను ఎక్కేందుకు ప్రజలు ఆసక్తిని చూపారు. తిరునాళ్ల సందర్భంగా కత్తి వేషధారణ వేసిన వ్యక్తులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. తిరునాళ్ల సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ ఎ. సురేంద్రబాబు ఆధ్వర్యంలో పటిష్టమైన బందోబస్తును ఏర్పాటు చేశారు.

రెంటచింతల: మండలంలోని రెంటచింతల, తుమ్మకోట, మంచికల్లు, పశర్లపాడు, మిట్టగుడిపాడు, పాలువాయి తదితర గ్రామాల్లో శనివారం మొహర్రం వేడుకలను భక్తి శ్రద్ధలతో ముస్లిం సోదరులు జరుపుకున్నారు. మొహర్రం నెల ముస్లింలకు మతపరంగా ఎంతో ప్రాముఖ్యత కలిగినది. ఇది అల్లాహ్ పవిత్రమైనదిగా నిర్ణయించిన నెల. 11 రోజుల నుంచి జరుగుతున్న ఈ మొహర్రం వేడుకల్లో చిన్నా పెద్ద తేడాలేకుండా అందరూ పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఎంతో నిష్టతో భక్తితో సంతాప దినాలుగా ప్రతి ముస్లిం పాటించి శనగపప్పులు, బొరుగులను ,పెరుగన్నంను భక్తులందరికి పంపిణీ చేశారు.

మొహర్రం వేడుకలు

మాచవరం: మండలంలోని పలు గ్రామాల్లో మొహర్రం వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఆయా గ్రామాల్లోని పీర్ల చావిళ్లలో ముజావర్లు పీర్లకు పూజా కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం, పీర్లను బయటకు తీసి గ్రామ పురవీధుల్లో మేళతాళాలతో ఊరేగించారు. ముస్లిం సోదరులు ఉపవాస దీక్షతో పీర్లను ధరించి ఊరేగింపులో పాల్గొన్నారు. ఆయా గ్రామాల ప్రజలు పీర్లకు పూజలు నిర్వహించి తమ కోర్కెలతో ముడుపులు కట్టారు. అనంతరం జల స్నానానికి తరలించారు.

ఘనంగా ముగిసిన మొహర్రం

కారెంపూడి: మొహర్రం (పీర్ల పండుగ) ముగింపు కార్యక్రమాన్ని శనివారం రాత్రి ఆచారవంతులు ఘనంగా నిర్వహించి ఆనాడు పవిత్ర యుద్ధంలో అమరులైన వీరులకు వీడ్కోలు పలికారు. సావిళ్ల నుంచి తీసిన పీర్లను ఊరేగింపుగా నాగులేరు వాగు ఒడ్డుకు తీసుకు వచ్చి అలంకారాలు తీసి వేశారు. షహదత్ (నిమజ్జనం) చేశారు. అనంతరం పీర్లను పెట్టెలలో భద్రపరచి వాటిని సావిళ్లకు తరలించారు. తర్వాత పెద చావిడి, చిన చావిడిల వద్ద ఉన్న నిప్పుల గుండాలను ఆర్పివేసి వాటిని పూడ్చారు. దీంతో ఇస్లాం ధర్మాన్ని రక్షించేందుకు నాడు జరిగిన పవిత్ర యుద్ధంలో అమరులైన ఇమామ్ హసేన్, ఇమామ్ హుస్సేన్ తదితర వీరుల ఆరాధన కార్యక్రమం ఘనంగా ముగించారు. ఇదిలా ఉంటే గత రాత్రంతా పీర్లకు గ్రామోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఊరేగింపులో హిందువులు కూడా పాల్గొని మత సామరస్యాన్ని చాటారు.

పిడుగురాళ్ల: పట్టణంలో ఘనంగా మోహర్రం వేడుకలను నిర్వహించారు. పట్టణంలో పీర్లను ఊరేగించుకుంటూ పీర్ల చావిడి వద్దకు వచ్చి పీర్లతో ముస్లిం సోదరులు నృత్యాలు చేశారు. ఈ విధంగా ముస్లింలు మోహర్రం వేడుకలను ఘనంగా నిర్వహించారు.

ఆంజనేయ స్వామి విగ్రహం ఏర్పాటుకు శంకుస్థాపన

గురజాల : దేవుని ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండి ఆనందంగా ఉండాలని చింతలపూడి చారిటబుల్ ట్రస్టు నిర్వాహకుడు చింతలపూడి శ్రీనివాసరావు, చింతలపూడి అశోక్‌లు అన్నారు. నగర పంచాయతీ పరిధిలోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి దేవాలయం వద్ద శ్రీ ఆంజనేయ స్వామి విగ్రహం ఏర్పాటుకు చింతలపూడి సోదరులు శనివారం శంకుస్థాపన చేశారు. వీరిని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి యెనుముల మురళీధర్‌రెడ్డి, దేవాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు ఘన స్వాగతం పలికారు. అనంతరం స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరిని యెనుముల మురళీధర్‌రెడ్డి , దేవాలయ కమిటీ సభ్యులు దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు.

దోమల నివారణకు చర్యలు చేపట్టాలి

వైద్యురాలు పద్మావతి

గురజాల : గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు దోమలు వ్యాప్తి చెందే అవకాశం ఉందని వాటి నివారణకు చర్యలు చేపట్టాలని మాడుగుల వైద్యురాలు పద్మావతి సూచించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో వీధుల్లో ఖాళీ కొబ్బరి బరికెలు, వాహనాల నుంచి తీసేసిన టైర్లున్న ప్రాంతాల్లో నీరు నిల్వ ఉన్న కాలువల్లో దోమలు స్థావరాలు ఏర్పాటు చేసుకుంటాయన్నారు. ఇంటి నివేశన ప్రాంతాల్లో మురుగునీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలన్నారు. దోమల నివారణకు నగర పంచాయతీ సిబ్బంది దోమలు వ్యాప్తి చెందకుండా మందును పిచికారీ చేయాలన్నారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశాలు ఉన్నాయని జాగ్రత్తగా ఉండాలన్నారు. రెండు రోజులకు మించి శరీరం వెచ్చబడితే వెంటనే వైద్యుల సలహాలు తీసుకుని మందులు వాడాలన్నారు.

ప్రజల సంక్షేమం కోసమే జగనన్న సురక్ష

ఎంపీపీ దాసరి చౌడేశ్వరి

తుమ్మకోట(రెంటచింతల): రాష్ట్ర ప్రజలకు సార్వత్రిక ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను 100 శాతం అమలు చేస్తూ చేపట్టిన సంక్షేమ పథకాలను అర్హులైన ప్రజలకు అందచేసి వారి సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు ఎంపీపీ దాసరి చౌడేశ్వరి అన్నారు. శనివారం మండలంలోని తుమ్మకోట గ్రామంలో సర్పంచ్ నల్లబాలు నాయక్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రజలకు వారివారి గ్రామాల్లోనే వారికి అవసరమైన కులం, ఆదాయం, రైస్ కార్డు, ఆరోగ్య శ్రీ కార్డు తదితర ధృవీకరణ పత్రాలను ఉచితంగా అందజేయడానికి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సీఎం జగన్ ప్రారంభించినట్లు తెలిపారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి మేలు చేయాలనే లక్ష్యంతో దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఈ విప్లవాత్మకమైన కార్యక్రమం ద్వారా గ్రామాల లోని ప్రజలకు ఉచితంగా 11 రకాల సేవలను అందించడంతో పాటు వారి సమస్యలు సంబంధిత అధికారులు తెలుసుకుని వాటిని అక్కడికక్కడే పరిష్కరించడం జరుగుతుందన్నారు. అనంతరం వివిధ రకాల సేవలకోసం, పథకాల కోసం దరఖాస్తు చేసుకున్న 58 మంది లబ్ధిదారులకు ధృవీకరణ పత్రాలను అందజేశారు. కార్యక్రమలో సర్పంచ్ నల్లబాలునాయక్, ఈఓపీఆర్డీ సీహెచ్ రామచంద్రరావు, ఆర్‌డబ్ల్యూస్ ఏఈ కొత్తా నరేంద్రారెడ్డి, పార్టీ నాయకులు, మాజీ సర్పంచ్ పోట్ల ముత్తయ్య, సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.

సున్నం మిల్లుల్లో కార్మికుల కూలి రేట్లు పెంచాలి



నిరసన వ్యక్తం చేస్తున్న సున్నం మిల్లు కార్మికులు

పిడుగురాళ్ల: సున్నం మిల్లులో చేసే కార్మికులకు పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా కూలీరేట్లు వెంటనే పెంపుదల చేయాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో గుంటూరు రోడ్‌లోనే సున్నం మిల్లుల ఏరియాలో చిట్టిబోయిన గిరిబాబు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో సీఐటీయూ మండల కార్యదర్శి తెలకపల్లి శ్రీనివాసరావు హాజరై మాట్లాడుతూ సున్నం పని చేసే కార్మికులకు కనీసం సౌకర్యాలు అమలు కావట్లేదు అని, మహిళా కార్మికులకు కనీసం మరుగుదొడ్లు, విశ్రాంతి గదులు లేవని వర్షమైన, ఎండ అయినా సున్నం కుప్పల పైన, చెట్ల కింద విశ్రాంతి తీసుకోవాల్సి వస్తోందని, ఎన్ని సార్లు యాజమాన్యానికి ఒప్పందాల సమయంలో విన్నవించిన పట్టించుకోవడం లేదని ఆయన విమర్శించారు. కార్మికులకు మాస్టర్ నిర్వహించాలని, దాని ఆధారంగా దీర్ఘకాలం పని చేసే కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ, సర్వీస్ వంటి చట్టపరమైన సౌకర్యాలు కల్పించాలని చెప్పినప్పటికీ అవి యాజమాన్యం అమలు చేయట్లేదని, అమలు చేమని లేబర్ డిపార్ట్ తెలియజేసిన లేబర్ అధికారులు తనిఖీ చేయడం లేదని ఆయన విమర్శించారు. ప్రతి కూలీ రేట్లు ఒప్పందానికి మధ్య నెల రెండు నెలల సమయం వృథా అవుతుందని కనుక యాజమాన్యం వెంటనే కూలీ రేట్లు పెంపుదలకు ముందుకు రావాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సున్నం మిల్లులు వర్కర్స్, యతిరాజుల శివయ్య, పెద్దిశెట్టి వెంకటేశ్వర్లు, దిద్దుల హరిబాబు, ఆర్. రామారావు, ఆవుల కోటేశ్వరరావు, జయరాజు, కాకర్ల సాంబయ్య, పి. నాగరాజు, బత్తుల ఏడుకొండలు, నాగేశ్వరరావు, శ్రీను కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులు, బాలింతలకు ప్రతినెలా రేషన్ పంపిణీ



రేషన్ పంపిణీ కిట్లను చూపుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు

బొల్లాపల్లి : గర్భిణులు, బాలింతలకు ఇంటికే రేషన్ ఇవ్వనున్నట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వి.శ్రీదేవి తెలిపారు. కొంతమంది గర్భిణులు, బాలింతలు మధ్యాహ్న భోజనానికి అంగన్‌వాడీ కేంద్రాలకు రావడం ఇబ్బందుల వల్ల ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని చెప్పారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆగస్టు 2వ తేదీన లాంఛనంగా ఇంటికే రేషన్ పథకం ప్రారంభిస్తారని, అప్పటి నుంచి వీరికి ప్రతినెలా రేషన్ అందజేస్తామన్నారు. 3 కేజీల బియ్యం , కేజీ కందిపప్పు, అర కిలో ఆయిల్, 25 గుడ్లు, 5 లీటర్ల పాలు, వీటితో పాటు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్టును అందజేస్తామన్నారు. ఈ కిట్టులో రాగి పిండి 2 కేజీలు, అటుకులు కేజీ, పావు కేజీ బెల్లం, పావు కేజీ చిక్కీలు, పావు కేజీ ఖర్జూరాలు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్టులో ఉంటాయని తెలిపారు. ఆగస్టు నెల నుంచి గర్భిణులు, బాలింతలు ప్రతి ఒక్కరికీ అంగన్‌వాడీ కేంద్రాల నుంచి రేషన్ పంపిణీ ఉంటుందని సూపర్‌వైజర్ తెలిపారు.

పేటలో బోధన నైపుణ్య శిక్షణ తరగతులు

నరసరావుపేట ఈస్ట్: శ్రీసుబ్బరాయ అండ్ నారాయణ కళాశాలలో ఆగస్ట్ 7వతేది నుంచి 11వతేదీ వరకు ఐదు రోజుల పాటు బోధనా నైపుణ్య శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సోము మల్లయ్య తెలిపారు. ఈమేరకు శిక్షణ తరగతుల బ్రోచర్‌ను శనివారం సాయంత్రం కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కళాశాల పాలకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు కపలవాయి విజయకుమార్, నాగసరపు సుబ్బరాయగుప్త ఆవిష్కరించారు. కళాశాల విద్యా కమిషనరేట్ సౌజన్యంతో జాతీయ విద్యా విధానానికి అనుగుణంగా బోధనా నైపుణ్యాలను పెంపొందించుకునేందుకు శిక్షణా తరగతులు దోహదపడతాయని ప్రిన్సిపల్ డాక్టర్ మల్లయ్య తెలిపారు.

తరగతులకు రిసోర్స్ పర్సన్స్‌గా న్యూఢిల్లీ ఎన్ఐఈపీఏ ప్రొఫెసర్లతో పాటు విద్యారంగంలో నిష్ణాతులైన ప్రొఫెసర్లు హాజరవుతారన్నారు. ఐదు రోజుల పాటు 600మంది అధ్యాపకులు శిక్షణా తరగతులలో పాల్గొంటారని తెలిపారు. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ లింక్ వివరాలకు 94906 45147, 9985048923 నెంబర్లలో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో ప్రోగ్రామ్ కన్వీనర్ డాక్టర్ ఎంఎస్ సుధీర్, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ డాక్టర్ పి.శ్రీనివాస సాయి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆర్‌బీకేల్లో ఎరువులు సిద్ధం

మండల వ్యవసాయాధికారిణి సంధ్యారాణి

గురజాల : రైతు భరోసా కేంద్రాల్లో ఎరువులు సిద్ధంగా ఉన్నాయని మండల వ్యవసాయాధికారిణి యం సంధ్యారాణి తెలిపారు. స్థానిక వ్యవసాయశాఖ అధికారి కార్యాలయంలో శనివారం మాట్లాడుతూ గత వారంలో వర్షాలు సమృద్ధిగా కురిసాయని భూములు పదునైయ్యాయన్నారు. రైతులు వారికి కావల్సిన ఎరువులు, కాంప్లెక్సు ఎరువులు రైతు భరోసా కేంద్రాల్లో ఎరువులు సిద్ధంగా ఉన్నాయని కావల్సిన ఎరువులు అన్ని అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. రైతులు దుకాణాల వద్దకు వెళ్లాల్సిన అవసరం లేదని గ్రామంలోని రైతు భరోసా కేంద్రాల్లో ఎరువులు ఉన్నట్లు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఓటర్ల సర్వే సక్రమంగా నిర్వహించాలి

తహసీల్దార్ చక్రవర్తి

పిడుగురాళ్ల: ఓటర్ల సర్వేను బీఎల్‌ఓ దగ్గర నుంచి సక్రమంగా నిర్వహించాలని తహసీల్దార్ చక్రవర్తి సూచించారు. పట్టణంలోని గాంధీనగర్ 12వ సచివాలయం నీళ్ల ట్యాంక్ వద్ద బీఎల్‌ఓలతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఎల్‌ఓలు బూత్‌లో ఏఏ వార్డు నాయకులు ఉన్నారో వారందరిని కలుపుకుని, లేదా విడివిడిగా నైనా వెళ్లి ఓటర్ల పరిశీలన చేయాలని, తొలగింపులు అన్ని పార్టీల వారికి అంగీకరిస్తేనే తొలగింపు చేసేలా చూడాలని, అదేవిధంగా ఎవరైనా చనిపోయి ఉంటే వారి ఓటును తొలగించడం, రెండు చోట్ల ఓట్లు ఉన్నట్లు అయితే ఓ ఏఊరిలో ఓటు కావాలో అడిగి తెలుసుకుని వారి ఆధార్ నంబర్‌తో ఆ ఓటుకు జత చేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో బీఎల్‌ఓలు తదితరులు పాల్గొన్నారు.

చెరువు శుభ్రం



శావల్యాపురం : శావల్యాపురం మంచినీటి చెరువులో నీటిని పూర్తిగా మోటార్ల ద్వారా బయటకు పంపినట్లు సర్పంచ్ యాగసిరి చెన్నమ్మ శనివారం తెలిపారు. గ్రామస్తులు సహకారంతో పంచాయతీ నిధులతో రెండు విద్యుత్ మోటార్లు ఏర్పాటు చేసి చిన్నపాటి మరమ్మతులు చేపట్టి, చెరువులో బ్లీచింగ్‌తో శుద్ధి చేసిన తదుపరి సాగర్ జలాలను చెరువులోకి నింపుతామన్నారు.

పాము కాటుకు మహిళ మృతి



శావల్యాపురం: పొలంలో గడ్డి కోస్తూ పాము కాటుకు గురై (విష సర్పం) ఓ వివాహిత మృతి చెందిన సంఘటన మండలంలోని కనమర్లపూడి గ్రామంలో శనివారం ఉదయం చోటుచేసుకుంది. ఎస్సై తుళ్ళూరి తిరుపతిరావు కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన వినుకొండ జ్యోతి (45) పొలంలో గడ్డి కోస్తుండగా పాముకాటుకు గురైనట్లు గమనించింది. ఇంటికి వచ్చి తన భర్త రాంబాబుకు విషయం చెప్పగా వెంటనే వినుకొండ వైద్యశాలకు తరలించారు. వైద్యులు పరీక్ష చేసి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారణ చేశారు. మృతురాలు భర్త రాంబాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. శవ పంచనామా అనంతరం మృతదేహాన్ని పోలీసులు కుటుంబ సభ్యులకు అందజేశారు. బాధిత కుటుంబాన్ని సర్పంచ్ తన్నీరు. భారతి, మండల వైఎస్సార్ సీపీ కోఆర్డినేటరు బోడెపుడి శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ తన్నీరు అంకారావు, ఎంపీటీసీ సభ్యురాలు మరియమ్మ గ్రామపెద్దలు తదితరులు మృతదేహాన్ని పరామర్శించి ఘన నివాళి అర్పించారు. ఈసందర్భంగా బోడెపూడి శ్రీనివాసరావు మాట్లాడుతూ బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు సారథ్యంలో కుటుంబానికి అండగా ఉంటామని వారికి ప్రభుత్వ పరంగా ఆర్థిక చేయూత అందిస్తామన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అధించాలి



పీహెచ్‌సీలో ఎన్‌క్యూఏఎస్ బృందం సభ్యులతో మెడికల్ ఆఫీసర్ నర్రా కృష్ణారెడ్డి, ఎంపీపీ, వైస్ ఎంపీపీ, సీహెచ్‌సీ సిబ్బంది

రెంటచింతల: స్థానిక పీహెచ్‌సీ కేంద్రానికి వివిధ రకాల వ్యాధులతో వచ్చే ప్రజలకు వైద్య సిబ్బంది మెరుగైన వైద్య సేవలను అంధించాలని ఎన్‌క్యూఏఎస్(జాతీయ నాణ్యత హామీ ప్రమాణాలు) కమిటీ సభ్యులు డాక్టర్ రాజ్ కుమార్ అన్నారు. స్థానిక పీహెచ్‌సీ కేంద్రంలో శనివారం ఆయన జాతీయ నాణ్యత హామీ ప్రమాణాలు బృందంతో కలిసి సందర్శించి పరిశీలించి మాట్లాడారు. కేంద్ర ఆరోగ్యశాఖ 2014 సంవత్సరంలో జాతీయ నాణ్యత హామీ ప్రమాణాలు కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగిందన్నారు. దేశంలో ఉన్న ప్రభుత్వ ఆస్పత్రులు అన్నీ కూడ ఈ కార్యక్రమంలో భాగమేనన్నారు. కేంద్ర ఆరోగ్యశాఖ నిర్దేశించిన నాణ్యతా హామీ ప్రమాణాలకు అనుగుణంగా ప్రభుత్వ ఆస్పత్రులను అభివృద్ధి చేయడానికి అనేక చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఏ ప్రభుత్వ ఆస్పత్రిలో 80 శాతం వైద్యసేవలు ఆరోగ్యశాఖ నిర్దేశించిన నాణ్యతా ప్రమాణాలు అనుగుణంగా ఉన్నా వాటిని జాతీయ నాణ్యత హామీ కింద గుర్తించబడుతుందన్నారు. ఆస్పత్రిలో రోగులకు ఆరోగ్య, ఆశ కార్యకర్తలు అందిస్తున్న సేవలు, పీహెచ్‌సీకి పరతి రోజు వచ్చే రోగుల వివరాలు(ఓపి) నమోదు, గర్భిణుకు ప్రతి నెల ఆస్పత్రిలో అందుతున్న వైద్యసేవలు, రోగుల సహాయకుల సేవలు, రక్తపరీక్షల వివరాలు, మందులు ఇచ్చే విభాగం పనితీరు, పరిపాలన విభాగం చేయు పనులు, ఆస్పత్రిలో జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు అమలుచేస్తున్న తీరును, వివిధ రికార్డులను పరిశీలించి తనిఖీ చేశారు. అనంతరం బృందం సభ్యులను ఎంపీపీ దాసరి చౌడేశ్వరి, వైస్ ఎంపీపీ ఏరువ శౌరెడ్డి దుశ్శాలవతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎన్‌క్యూఏఎస్ సభ్యులు ఆరోగ్యమేరి, వైద్యాధికారి హేమ, మలేరియా అధికారి సీహెచ్ అంకమ్మరావు, సీహెచ్‌ఓ పూజల నాగేశ్వరరావు, ఆరోగ్య, ఆశ కార్యకర్తలు, ఆస్పత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సాగర్ జలాలు తరలివచ్చె!



చిలకలూరిపేటకు మంచినీరు సరఫరా చేసే రెండు చెరువులకు సాగర్ జలాలు చేరుకుంటున్నాయి. తాగునీటి రెండు చెరువుల్లో నీటి నిల్వలు కనిష్ఠ స్థాయికి చేరుకోవడం, ప్రతి ఏడాది జూన్‌లో విడుదల చేసే సాగర్ జలాలు ఈ ఏడాది విడుదల కాకపోవడంతో నీటి ఎద్దడి తలెత్తే పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో వైద్య ఆరోగ్యశాఖా మంత్రి విడదల రజిని రెండు రాష్ట్రాలకు సంబంధించిన ఈఎన్‌సీలతో మాట్లాడి సాగర్ జలాల విడుదలకు ప్రత్యేక అనుమతి తీసుకున్నారు. ఈ నేపథ్యంలో ఎన్ఎస్‌పీ అధికారులు 4.2 టీఎంసీల నీటిని విడుదల చేశారు. ఈ నెల 25 నుంచి మంచినీటి చెరువులకు సాగర్ జలాలు చేరుకోవడం ప్రారంభమయ్యాయి. కొద్ది రోజులు మాత్రమే సాగర్ జలాల లభ్యత ఉన్న నేపథ్యంలో ప్రత్యేకంగా ఆయిల్ ఇంజన్లు ఏర్పాటు చేసి నీటిని చెరువులకు పెడుతున్నారు. శనివారం మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, మున్సిపల్ కమిషనర్ సీహెచ్ గోవిందరావు, పబ్లిక్ హెల్త్ ఈఈ శ్రీనివాసరెడ్డి, మున్సిపల్ డీఈఈ తోట వెంకట రమణ చెరువులను పరిశీలించారు. ఎన్ఎస్‌పీ అధికారులకు ఫోన్ చేసి కనీసం మరో 15 నుంచి 20 రోజుల పాటు కెనాల్ ద్వారా నీటిని అందుబాటులో ఉంచాలని కోరారు. అప్పుడే కొంత మేరకైనా చెరువులను నింపుకొనే అవకాశం ఉంటుందని తెలిపారు.

–చిలకలూరిపేట